ప్రజాశక్తి

గురువారం 25 జులై 2024 5

శ్రీ సత్యసాయి

కేశవ్‌పై.. 'అనంత' ఆశలు.!

◆ నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్

◆ పంటనష్ట పరిహారానికి రైతుల ఎదురుచూపు

◆ సాగునీటికి నిధులు విడుదల చేసేరా..?

రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కేశవ్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఆశాజనకంగా నిధులు వస్తాయన్న ఆశతో ప్రజలు ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మేరకు ఉమ్మడి జిల్లాకు నిధులు వస్తాయన్న దానిపై ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత ఐదేళ్ల కాలంలో జిల్లాలో సాగునీటి రంగాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని అప్పట్లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. ఐదేళ్లు పూర్తయినా పనులు మాత్రం ముందుకు కదల్లేదు. నిధుల కేటాయింపులూ జరగలేదు. అంతకు మునుపు పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఈ ఐదేళ్లలో ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ప్రకటించారు. ఇది కూడా ప్రకటనలకే పరిమితం అయ్యింది. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మత్తులకైనా రూ.30 కోట్లు ఇవ్వాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కూడా లేకుండాపోయింది. దీంతో నీరొచ్చినప్పుడల్లా ఎక్కడ గండ్లు పడుతాయోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. ఈ పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో వీటి ప్రస్తావన తీసుకొస్తారా.. లేదా.. అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు. 2023 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. పంటనష్టాన్ని అంచనా వేశారు. బడ్జెట్‌లో దీనిపైనా ప్రభుత్వం ఏమైనా ప్రకటన చేస్తుందాని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా పట్టు రైతులు, రీలర్లు ఇన్‌సెంటివ్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. వీటిపై కూటమి ప్రభుత్వం ఏప్రకటన చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ఎన్నికల ముందు టిడిపి నాయకులు అనేక హామీలను ఇచ్చారు. ఆ హామీల మేరకు అభివృద్ధి పనులకు ఏ మేర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందన్నది నేడు తేలనుంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా... అంగన్వాడీ నుంచి పాఠశాలు, కళాశాలల వరకు అడ్మిషన్ పొందాలన్నా.... బ్యాంకుల్లో ఖాతా తెరవాలన్నా.... ప్రభుత్వం ద్వారా ఏ చిన్న పని చేసుకోవలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. ఇంత ప్రాధాన్యత గల ఆధార్ కార్డుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఇటీవల ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంకా 4,74,537 మంది ఆధార్ కార్డులను అప్ డేట్ చేయాల్సి ఉంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధార్ అప్ డేట్ కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ శిబిరాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఆధార్ నమోదుకు హిందూపురం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో క్యూ కట్టిన ప్రజలు

నత్తనడకన ఆధార్ అప్‌డేట్

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంకా 4,74,537 మంది పెండింగ్

◆ 27వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్

హిందూపురం 6వ వార్డు సచివాలయంలో ఆధార్ సేవలను అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5-15 సంవత్సరాల వయస్సున్న వారు 2,09,177 మంది, 15-17 సంవత్సరాల వయస్సున్నవారు 2,02,062, 18 సంవత్సరాల పై బడి ఉన్నా వారు 63,298 మంది మొత్తం 4,74,537 మందికి సంబంధించిన ఆధార్ కార్డుల డాక్యుమెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు 18,98,374 మంది ఆధార్ కార్డులు అప్ డేట్ చేయాల్సి ఉంది. ఆధార్ లేని వారికి నూతన ఆధార్ నమోదు చేయడంతో పాటు బయోమెట్రిక్ వంద శాతం పూర్తి చేయడం కోసం ఇప్పటికే నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. వీటితో పాటు సచివాలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలు పరిశీలించి నిర్దిష్ట సమయంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కోంది. ఉమ్మడి జిల్లాలో శ్రీ సత్యసాయి జిల్లాకు 109 కిట్లు ప్రభుత్వం సరఫరా చేస్తే ఇందులో 52 పని చేస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 133 కిట్లు ఉంటే 82 కిట్లు పని చేస్తున్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో అయితే 5 సచివాయాల ఎడ్యూకేషన్ సెక్రేటరీలకు శిక్షణ ఇచ్చి ఆధార్ సేవలను అందించాలని అధికారులు సూచించారు. దీంతో పురపాలక సంఘంలోని 6, 28, 14, 38, 34 వార్డు సచివాయాల్లో ఆధార్ సేవలను అందించాల్సి ఉంది. 6వ వార్డు సచివాలయంలో మాత్రం తూతూమంత్రంగా సేవలు అందుతున్నాయి. ఇక్కడ సిబ్బంది తక్కువ ఉండడంతో ఉదయం వేళల్లో సచివాలయాల సేవలను అందించి, మధ్యాహ్నం నుంచి ఆధార్ సేవలను అందిస్తున్నారు. మిగిలిన 4 సచివాయాల్లో సరఫరా చేసిన కిట్లు పక్కన పడేశారు. దీంతో ప్రజలకు ఆధార్ సేవలు అందడం లేదు. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిన సమయాల్లో సైతం ఈ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందించడం లేదు. పట్టణంలో ఇప్పటికే బిఎస్ఎన్ఎల్, పోస్టు ఆఫీసుతో పాటు బ్యాంకుల్లో నడుస్తున్న కేంద్రాల్లో ఆధార్ సేవలు అందుతున్నాయి. ఇక సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక శిబిరంపై విస్తృత ప్రచారాలు నిర్వహించి వంద శాతం పూర్తి జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే అధికారుల పర్యేక్షణ లోపంతో మిగిలిన సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పని చేయడం లేదు.

కనిపించని ఆధార్ మొబైల్ క్యాంప్‌లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 రోజుల పాటు నిర్వహించే ఆధార్ ప్రత్యేక శిబిరంపై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లాలో మొదటి రోజు ఒక్క చోట కూడా ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయలేదు. కనీసం ఈ విషయాన్ని మీడియాకు అధికారులు తెలపలేదు. మొబైల్ క్యాంప్‌ల నిర్వహణ కోసం ఆధార్ ఆపరేటర్లను నియమించి, సేవలను విస్తృతంగా చేపట్టాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆధార్ అప్‌డేట్ సేవలతో పాటు ఇతర సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. అధికారులు ఇప్పటికైన దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అందరికీ ఆధార్ సేవలు అందే విధంగా చూడాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

మద్దిలేరులో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని హిందూపురం రోడ్డు సమీపంలోని మద్దిలేరు వాగులోని ఆక్రమణలను అధికారులు బుధవారం తొలగించారు. ఈ వాగుకు అనుకొని స్థిరాస్తి వ్యాపారి భూమిని కొనుగోలు చేసి పక్కనే ఉన్న వాగును ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. విషయాన్ని ప్రజలు పలుమార్లు నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 15 రోజుల క్రితం నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు ఈ భూమిలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో స్థిరాస్తి వ్యాపారి 10 సెంట్లు మేర వాగును ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో అధికారులు ఆక్రమణ తొలగింపునకు 15 రోజులు గడువు ఇచ్చారు. ఈ గడువులోపు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అయితే గడువు ముగిసినా ఆక్రమణలు తొలగించకపోవటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. పోలీసుల సాయంతో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రెవిన్యూ, మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకొని ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

ఉద్రిక్తతల నడుమ మండలమీట్ వాయిదా

ప్రజాశక్తి - చిలమత్తూరు

బుధవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కోరం లేదన్న కారణంతో ఈనెల 27వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ రామ్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించే మండల మీట్‌లో కొంతమంది మహిళా ఎంపిటిసిలు, తెలుగుదేశం నాయకులతో కలిసి పలు అంశాల పై ఎంపిపిని నిలదీసేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు గుమికూడారు. టిడిపి శ్రేణులను అక్కడి నుండి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. అయితే మహిళ ఎంపిటిసిలు, జడ్పిటిసి అనుషా పోలీసుల తీరును వ్యతిరేకించారు. తమను గత వైసిపి ప్రభుత్వంలో ఎంపిపి చాలా ఇబ్బందులకు గురిచేశారని ఎంపిపి సమావేశానికి వస్తే పలు అంశాలపై నిలదీస్తామని అన్నారు. అయితే సమావేశానికి ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, పలువురు ఎంపిటీసిలు హాజరు కాలేదు. దీంతో ఈ సమావేశాన్ని వాయిదా వేస్తూ ఎంపిడిఒ ఉత్తర్వులు జారీ చేశారు. కోరం సభ్యులు హాజరు కానందున వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తొలుత బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకటించగా హాజరైన ఎంపిటిసిలు దీనిని వ్యతిరేకించారు. మరో రోజు సమావేశం నిర్వహించాలని సూచించారు. దీంతో ఈ నెల 27 వ తేదీకి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకటించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఎటిఎల్ రుక్మాంగద అన్నారు. స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా ఆర్టీటి-ఎఫ్ఎఫ్ స్కూల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఇందులో ఆరు జట్లు పాల్గొంటున్నాయి.. బుధవారం బాలుర విభాగంలో బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్ల మధ్య, బాలికల విభాగంలో విజేత స్కూల్, శ్రీజ్యోతి హైస్కూల్ జట్లు మధ్య క్రికెట్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. ఇందులో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బత్తలపల్లి శ్రీజ్యోతి హైస్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు ఆర్డీటీ ప్రతినిధులు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ జయరాం, అప్పస్వామి, ప్రవీణ్, కుమార్ రాజు, రఫీ, గంగిరెడ్డి. ఆయా పాఠశాలలకు చెందిన పీఈటీలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని 39వ వార్డుకు చెందిన చిన్నారి దీక్షిత విషజ్వరంతో బాధపడుతూ బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు డోలా రాజారెడ్డి బాధితులను పరామర్శించి రూ. 5వేలను అందజేశారు. అలాగే ధర్మవరం మున్సిపాలిటీ 27వ వార్డు ఇందిరమ్మ కాలనీవాసులు రవీందర్ రెడ్డి, చంద్రప్పలకు మొహరం పీర్ల పండగ సందర్భంగా 5వేల రూపాయల విరాళాన్ని వారు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి ప్రమీల ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మలసముద్రం సర్పంచి సువర్ణ అశ్వర్థరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామపంచాయతీలోని గ్రామాల్లో పలు సమస్యలు నెలకొన్నాయన్నారు. విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టాయని వాటిని మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసిన సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. జడ్పిటిసి జయరాం నాయక్ మాట్లాడుతూ గోరంట్ల మండలానికి సబ్ రిజిస్టర్ కార్యాలయం మంజూరుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన, చేపట్టబోయే పథకాలు, కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామలక్ష్మమ్మ తహశీల్దార్ అక్బాల్ బాషా, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయాశాఖల అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఈనెల 24వ తేదీ తెలంగాణ బోనాల సంబరాలు-2024 కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన మానస నృత్య కళాకేంద్రం వారి శిష్యబృందం పాల్గొంది. తమ కళాకారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకోవడం తమకు మరింత ఉత్సాహాన్ని అందించిందని గురువు మానస తెలిపారు. రుత్విక, లిసికా సాయి దుర్గ, కీర్తి శ్రీ, లికిత నృత్యప్రదర్శనను నిర్వాహకులు అభినందించారన్నారు. వారిని తెలంగాణ బోనాల సంబరాల కమిటీ వారు సత్కరించి "జ్ఞాన సరస్వతి" పురస్కారాన్ని అందజేశారని చెప్పారు.

కవులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతంలో ఉన్న కవులను ప్రోత్సహించడానికి తపన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందిస్తున్నామని వేదిక అధ్యక్షులు సడ్లపల్లి చిదంబర రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత సామాజిక సమస్యలు, ఇక్కడి ప్రజల నిత్య వ్యవహారిక జీవ భాషకు సాహిత్య రంగంలో చోటు కల్పించి రచిస్తున్న కవులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో తపన సాహిత్య వేదికను ప్రారంభించామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే కొంతమంది కవులు రాసిన సాహిత్యాలను, నవలలను ఎంపిక చేసామన్నారు. ఇందులో భాగంగా సోమందేపల్లి మండలం చాకర్లపల్లి యాములపల్లి నరసి రెడ్డి, ఎంజిఎం పాఠశాలలో ఉపాధ్యాయులకు విధులు నిర్వహిస్తున్న గుడిబండ మండలం సిద్ధగిరి గ్రామానికి చెందిన శ్రీనివాస్, బద్వేల్ మండలం నందిపల్లి గ్రామానికి చెందిన లంకమల వివేక్‌కు రూ. 5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించడానికి ఎంపిక చేసామన్నారు. త్వరలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వీరందరినీ సన్మానించి పురస్కారాన్ని అందిస్తామన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలను ధర్మవరంశాఖ గ్రంథాలయంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంత కార్పొరేషన్‌లో బదిలీలలు..!

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ బదిలీల్లో ఓ అధికారి చేతివాటం చూపించారన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా నడుస్తోంది. గతంలో పనిచేసినచోట చూపిన చేతివాటమే ఇక్కడ కూడా ఆ అధికారి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల్లో నిబంధనలను గాలికొదిలేసి, అధికారి చేతివాటం చూపారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏడాది కాలం ముగియకుండానే గుమాస్తాల బదిలీల్లో సీట్ల మార్పిడి జరిగిన తంతు చూస్తే పెద్ద మొత్తంలోనే కాసులు చేతులు మారాయన్న విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి.

◆ గుమాస్తాల బదిలీల్లో గందరగోళం

◆ సీనియర్ అసిస్టెంట్లకు జూనియర్... జూనియర్లకు సీనియర్ అసిస్టెంట్ల స్థానాలు కేటాయింపు..!

◆ నిబంధనలు గాలికి...

◆ చేతివాటం చూపిన ఓ అధికారి.!?

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మెప్మాలోని ఒకే సీటుకు ఇద్దరు గుమాస్తాలను నియమించి, అక్కడ పనిచేసే సీనియర్ అసిస్టెంట్ బాలాజీని ఎక్కడికి బదిలీ చేశారన్న విషయాన్ని ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లోని జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ రెడ్డిని మెప్మా విభాగానికి గుమాస్తాగా నియమిస్తూ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీతో ఇద్దరు గుమాస్తాలు మెప్మాలో పని చేయాల్సి ఉంటుందా అన్న సందేహం ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది. మూడు సంవత్సరాలకు పైబడి ఒకే సీటులో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాల్సి ఉండగా, ఆ అధికారి ఏడాది కాలం కూడా ఒక సీటులో పనిచేయుని ఉద్యోగులను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గత కమిషనర్ మేఘస్వరూప్ పాలన కాలంలో గుట్టు చప్పుడు కాకుండా సూపరింటెండెంట్, గుమాస్తాల బదిలీలు హడావుడిగా జరిగాయి. నాలుగు సంవత్సరాలకు పైబడి ఒకే సీటుకు పరిమితమై పనిచేస్తున్న వారు అటు మున్సిపల్ కార్పొరేషన్, ఇటు నగర పాలకోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు ఎక్కువమంది ఉన్నారు. వారెవరినీ బదిలీ ప్రక్రియలో చేర్చకుండా కేవలం ఏడాదికి పైగా పని చేసిన వారికి బదిలీల్లో చోటు కల్పించడం చూస్తే సదరు అధికారి వారికి ఇచ్చిన ప్రాధాన్యత ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వారిని జూనియర్ అసిస్టెంట్ల సీట్లలోకి మార్చడంపైనా అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సీనియర్ అసిస్టెంట్ సునీల్ ప్రస్తుతం హెచ్-1 సీటులో ఏడాది కాలంగా పని చేస్తున్నారు. ఆయన్ను రెవెన్యూ విభాగంలో ఇన్‌ఛార్జి యుడిఆర్‌ఐగా నియమించారు. నెలరోజుల సెలవులో ఉన్న వేణుగోపాల్ తిరిగి విధుల్లో చేరితే సునీల్ తిరిగి హెచ్-1 అసిస్టెంట్‌గానే కొనసాగాల్సి ఉంటుంది. ఇంత స్వల్ప కాల వ్యవధికే ఆఘమేఘాలపై మార్పులు చేయాల్సిన అవసరం ఏమిటన్నది బదిలీ చేసిన ఆ అధికారికే తెలియాలని ఉద్యోగులు చెబుతున్నారు. రెవెన్యూ విభాగంలోని వేణుగోపాల్ సెలవులో ఉండటంతో ఆ బాధ్యతలను ఎస్ఆర్ బాబుకు గత కమిషనర్ మేఘ స్వరూప్ అప్పగించారు. ఆ ఉత్తర్వులను ఆగమేఘాల మీద అధికారి మార్చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఎస్టాబ్లిష్‌మెంట్ సీటు సి1 బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశాభేగంను జూనియర్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ విభాగానికి మార్చారు. సీనియర్ అసిస్టెంట్‌ను జూనియర్ సీటుకు కేటాయించటం ఏ నిబంధనల మేరకు వస్తుందనేది బదిలీ చేసిన అధికారికే తెలియాల్సి ఉంది. జూనియర్ అసిస్టెంట్ వి.సాయి శరత్‌కుమార్‌కు కీలకమైన ఎస్టాబ్లిష్‌మెంట్ సీటును కేటాయించారు. అయితే సాయి శరత్ కుమార్ రెవెన్యూ విభాగంలో ఏ-1గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ రెండు సంవత్సరాల కాలం మాత్రమే విధులు నిర్వహించారు. ఉన్నఫలంగా ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. రెవెన్యూ విభాగంలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ సావిత్రమ్మను హైస్కూల్‌కు బదిలీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఎం.యుగంధర్ రెడ్డిని మెప్మా క్లర్క్‌గా బదిలీ చేశారు. అక్కడ ఉన్న సీనియర్ అసిస్టెంట్ బివి.బాలాజీని ఎక్కడికి బదిలీ చేశారో ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. బాలాజీని ఎక్కడికి మార్చారన్న విషయంపై స్పష్టత లేదు. ఇప్పటికీ రెవెన్యూ విభాగంలో కీలకమైన ఏ-1 అసిస్టెంట్ సీటుకు ఎవరినీ నియమించకపోవడం గమనార్హం. రెవెన్యూ వసూళ్లకు సంబంధించిన డీడీలు చెక్కులు తదితర అంశాలు ఆ అధికారి పరిధిలోకే వస్తాయి. గతంలో ఆ సీట్లో పనిచేసిన ఓ ఉద్యోగి నిర్వాకంతో ఆస్తి, నీటి పన్నుల చెల్లింపు రూపంలో పంపిన డీడీలు, చెక్కులను బ్యాంకులో జమ చేయకుండా ఆయన వద్దనే అట్టిపెట్టుకుని లక్షలాది రూపాయలు కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లే చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఇక బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న షరీఫ్ ఖాన్‌ను ఇంజినీరింగ్ విభాగంతో సంబంధం లేని స్థానంకు మార్చారు. ఇలా కార్పొరేషన్‌లో ప్రతి బదిలీ కూడా లోప భూయిష్టంగా తయారుచేసి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుత కమిషనర్ పివివి.ఎస్.మూర్తి ఈ బదిలీలపై జోక్యం చేసుకుని పరిశీలిస్తే అసలు వాస్తవాలు బహిర్గతం అవుతాయన్న చర్చ కార్పొరేషన్‌లో నడుస్తోంది.

తహశీల్దార్ కార్యాలయాల తనిఖీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను భద్రపరిచే విషయంలోకట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సూచించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి లో జరిగిన సంఘటన దష్టిలో పెట్టుకుని తహశీల్దార్‌కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ పుల్లారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఆర్డీవో వంశీకృష్ణతో కలిసి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు : తనకల్లు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కదిరి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని రికార్డులను, పరిశీలించి ప్రతి ఫైలును జాగ్రత్తగా భద్రపరచాలని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో రికార్డు రూమును జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శోభా, సువర్ణమ్మ, వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంబులపూల కుంట : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డుల భద్రతపై తహశీల్దార్ నరేంద్ర కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు

గాండ్లపెంట : స్థానిక తహశీల్దార్‌కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో వంశీకృష్ణ బుధవారం పరిశీలించారు. రికార్డులను, కంప్యూటర్ గదులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై తహశీల్దార్ శ్రావణితో చర్చించారు. మండలంలోని ఎస్సీ, బీసీ నాయకులు డి ఆనంద్, గోపాల్ నాయక్ తదితరులు మండల కేంద్రంలో శ్మశాన వాటిక, అంబేద్కర్ భవనం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం మండల కేంద్ర సమీపంలో ఉన్న బియ్యం గిడ్డంగిని జేసీ పరిశీలించారు. చౌక్ డిపోలకు సక్రమంగా బియ్యాన్ని సరఫరా చేయాలని స్టాక్ పాయింట్ అధికారి బాబురావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి వాణి, వీఆర్వోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాగి పంటసాగుపై అవగాహన

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని జమ్మనిపల్లి గ్రామ రైతులకు రాగిపంట సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఎఒ తిమ్మప్ప, సహాయకులు మారుతి ఆధ్వర్యంలో గ్రామ రైతులకు రాగి, వేరుశెనగ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు పంటను ప్రారంభ దశలోనే రోగాల నుండి అరికట్టేందుకు తీసుకోవలసిన మెలకువలను రైతులకు అధికారులు తెలియజేశారు,

రేపు చెరువు వేలంపాట

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని పంతులచెరువు పంతులచెరువు, ఇందుకూరి పల్లి కుంటలో ఒక సంవత్సర కాలం పాటు చేపలు పట్టుకొనే హక్కులని పొందేందుకు ఈనెల 26న శుక్రవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి విజయ్ తెలిపారు. సర్పంచి స్వర్ణలత అధ్యక్షతన జరిగే బహిరంగ వేలంపాటలో పాల్గొనదలిచిన వారు రెండు వెలు రూపాయలు ధారవత్తుగా చెల్లించాలని కార్యదర్శి చెప్పారు.

అప్రాచెరువులో ఉట్లమానోత్సవం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలో సమస్యాత్మక గ్రామంగా పరిగణింపబడుతున్న అప్రాచెరువు గ్రామంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఉట్లమాను ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బుధవారం గ్రామంలోని పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన ఉట్లమాను గ్రామంలోని వాల్మీకి (బోయ) యువకులు పోటీ పడి ఎక్కడానికి ప్రయత్నించారు. ఉట్లమాను పై భాగంలో ఉంచిన బహుమతిని అందుకోవడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా బురద చల్లుకుంటూ ఎక్కడానికి ప్రయత్నించారు. సాయంత్రం 4.30గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించారు.

నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని తిలక్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. 15వేల రూపాయలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్ను లు పెన్సిల్ లు తదితర విద్యా సామాగ్రి ని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు నాగమణి, విశ్రాంత ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ముద్ద చర్మపు వ్యాధి(లంపి స్కిన్ డిసీజ్) నివారణకు పశువులకు టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, గంటాపురం గ్రామాల్లో ఎల్ఎస్ వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ద చర్మపు వ్యాధి ప్రాణాంతకమైన వైరస్ వ్యాధి అని అన్నారు. ఇది చర్మంపై, శరీరంలోని ఇతర భాగాలపై నాడ్యూల్స్ కలిగి ఉంటుందన్నారు. సెకండరీ బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ తరచుగా పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుందన్నారు. ముద్ద చర్మపు వ్యాధి నివారణకు ప్రభుత్వం ద్వారా టీకాలు ఉచితంగా వేయిస్తోందని రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, సిబ్బంది సురేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE:ANANTHAPURAMU
(In the Matter of Obtaining Permission to Sell the Property of Minor Y.Lakshya Raj @ Mannavaram Lakshya Sree)
G.O.P.No:40/2024
Between:
M.Manasa Sreedhar ...**Petitioner**
And
Nil ...**Respondent**
ప్రకటన
పై నెంబరు కోసులో మైనర్ బాలిక అయిన వై.లక్ష్య రాజ్ @ మన్నవరం లక్ష్య శ్రీ తరుపున వారి తల్లి గారు అయిన ఎమ్.మానస శ్రీదర్ గారు పై కోర్టు నందు మైనరు బాలిక యొక్క ఆస్తిని వారి పోషణ కొరకు, విద్యాభివృద్ధికి, కుటుంబ నిర్వాహణ ఖర్చుల నిమిత్తం, మరియు లోకుల నుండి చేరిన అప్పులను తీర్చుట కొరకు పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున ఎవరికైనా ఎలాంటి అక్షేపణలు ఉన్న యెడల 19/08/2024 వ తేది నాడు ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పిటీషనర్ పరోక్షమున తీర్మానం చేయబడును.
షెడ్యూలు
Property Situated Within the RD of Hindupur and SRD of Bukkapatnam, Puttaparthi Town, Puttaparthi Municipal Area Limits, Puttaparthi Mandal, Sri Sathya Sai District.
Govt-Dry S.No:282-2, **A.C** 0-74 paiki,
A.C 0-12 Cents, or 0-048 Hrs
Bounded By:
East:-Coumpound Wall others,
West:-12 Feet Road, **North:**-20 Feet Road,
South:-Road
V.BHARADWAJA PADMANABHA TEJA,
Advocate, Anantapuramu.
CELL:9700713342

విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
శ్రీ సత్యసాయి జిల్లా
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
తాడిమర్రి ధర్మవరం రూరల్ కనగానపల్లి రామగిరి రొళ్ల గుడిబండ
ఇంటర్వ్యూ : తేది: 26-07-2024 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Ananthapuramu

సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహిళా పోలీసులు

జిల్లాలోని మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామనిజిల్లా ఎస్పీ వి.రత్న హామీ ఇచ్చారు. జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్పీ రత్నను మహిళా పోలీసుల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షురాలు ఎంవీ భవాని(అమడగూరు మండలం), ధర్మవరానికి చెందిన మహిళా పోలీస్ కష్ణవేణి ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు మహిళా పోలీసులు ఎస్పీ రత్నను పుట్టపర్తిలో ఆమె ఛాంబర్ లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ త్వరలోనే మహిళా పోలీసులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

మూకదాడులకు అడ్డుకట్ట వేయాలి

హిందూపురం : ఎన్‌డిఎ పాలనలో దళిత, ముస్లింలపై జరుగుతున్న మూక దాడులకు అడ్డుకట్ట వేయాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాసీబ్ డిమాండ్ చేశారు. దాడులకు వ్యతిరేకంగా సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హాసీబ్ మాట్లాడుతు కేంద్రంలో మూడవసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత దాడులు మరింత పెరిగాయన్నారు. లోక్‌సభ ఫలితాల తర్వాత 8 హత్యలు, 6 మూక దాడులు జరిగాయన్నారు. చట్ట విరుద్ధంగా బుల్డోజర్లతో మూడు ఇళ్లకూల్చివేశారన్నారు. ఇంత జరిగిన ఈ దాడులు నిర్వహించిన దుండగులపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి దీనిపై వెంటనే స్పందించి నిందితులకు కఠినంగా శిక్షించే విధంగా చర్యలు చేపట్టాలని డిమెండ్ చేశారు. సంఘ్ పరివార్ ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా చట్టాలను రూపొందించాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ట్రిపుల్ ఐటికి గ్లోబల్ జెన్ విద్యార్థి

ప్రజాశక్తి - సోమందేపల్లి

కె. శాంతన్

పెనుకొండ పట్టణంలోని గ్లోబల్‌జెన్ పాఠశాలకు చెందిన కె .శాంతన్ అనే విద్యార్థి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటిలో సీటు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ యు. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాలలో చదివిన శాంతన్ 2023 -2024 పదవ తరగతి ఫలితాలలో 591 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 9 వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 6 వ ర్యాంకుతో ప్రతిభ చాటినట్లు చెప్పారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థిని కరస్పాండెంట్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన 'చిలకం'

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'చిలకం'

శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్‌ను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమును అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ధర్మవరం నియోజకవర్గ సమస్యలపై, జిల్లా సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆబు, తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం రొద్దం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి అరాచక పాలనకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు హిందూపురం ప్రాంత నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జ్ దీపిక, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, వేణు రెడ్డి, చలివెందుల సర్పంచ్ ఉపేంద్ర కుమార్ రెడ్డి, ఫారూఖ్, ప్రణయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తపాలా శాఖలోని వివిధ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం సబ్ డివిజన్ తపాలా ఇన్స్‌పెక్టర్ రాజేష్ కోరారు. పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద గల ప్రధాన తపాలా కార్యాలయంలో ఖాతాదారులకు, ప్రజలకు, సిబ్బందికి తపాలా శాఖలో ఉన్న 11 పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని బధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి, జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ శైలజ, ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ వెంకటేష్ తదితరులు, ఏపీఎం సేవింగ్స్ బ్యాంక్ వేదాంతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా సావినీర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : తపాలా శాఖలో బీమా చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు అన్నారు. గ్రామీణ తపాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో తపాలాశాఖ సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ సేవల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో కదిరి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ గోవర్ధన్ నాయక్, నవీన్, భరత్ ,దుర్గ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

సిఐటియు మండల కమిటీల ఎన్నిక

పెనుకొండ సిఐటియు మండల కమిటీ నాయకులు

చిలమత్తూరు సిఐటియు మండల కమిటీ నాయకులు

ప్రజాశక్తి - పెనుకొండ

పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా రమేష్, కో కన్వీనర్‌గా బాబావలి, కోశాధికారిగా బావమ్మతో పాటు అంగన్ వాడి యూనియన్ సావిత్రమ్మ, లక్ష్మీదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ రాజేశ్వరి, తోపుడు బండ్ల సంఘం మాబాషా, రాజు రావు, షేక్షావలి, హబీబ్, ఆరిఫ్, ఆటో యూనియన్ షరీఫ్, తిప్పన్న, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాగరాజుతో పాటు 15మందిని కమిటీ సభ్యులు గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెదపల్లి బాబా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని చెప్పారు.

చిలమత్తూరు : మండల కేంద్రంలోని కార్మిక కర్షక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల కన్వీనర్‌గా రామచంద్ర, కో- కన్వీనర్‌గా వెంకటేష్, కమిటీ సభ్యులుగా శోభారాణి, పద్మావతి,లక్ష్మి నారాయణ, రామతులసి, ఈశ్వరమ్మ, పుణ్యవతి, లక్ష్మి నరసమ్మ, శోభ, రెడ్డమ్మ, చౌడేశ్వరి, చలపతి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సుధాకర్, నాగరాజు, శోభ, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు, తదితరులు

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ మండల అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మా లింగప్ప, వై జోగప్ప ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా . నారాయణస్వామి, అధ్యక్షులుగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా అనిల్ కుమార్ మహిళా ఉపాధ్యక్షురాలుగా వసంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కేశవ్ ప్రసాద్, కోశాధికారిగా పోతులయ్య, కార్యదర్శులుగా ఇదాయితుల్లా, అనిల్ కుమార్, చిన్నికృష్ణ, శ్యాం ప్రసాద్, నరేంద్ర, ఉగ్ర నరసింహ, పార్థసారథి, అర్జున్‌తో పాటు ఆడిట్ కమిటీ సభ్యులుగా ముస్లిం వలి, ఉషారాణి, మహేష్, నాగరూపను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజధానికి నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఏపీకి సానుకూలంగా నిధులు కేటాయించడం హర్షనీయమని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతికి, పోలవరం నిర్మాణానికి కేంద్రం సహాయం చేస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం శుభ పరిణామం అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రొద్దం విద్యార్థిని

ప్రజాశక్తి - రొద్దం

సుకన్య

రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని నారనాగేపల్లి హై స్కూల్ విద్యార్థి ఎంపిక అయినట్లు వ్యాయమ ఉపాధ్యాయులు మహేష్ తెలిపారు. ఆ పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి టి.సుకన్య రెండు రోజుల క్రితం అనంతపురం ఆర్డీటీ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో అనంతపురం జిల్లా జట్టుతరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఆగస్టు 10 నుండి 13 వ తేదీ వరకు గుంటూరు జిల్లా వినుకొండ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సుకన్య పాల్గొంటున్నట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన సుకన్యను ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

శ్మశానవాటిలో నెలకొన్న సమస్యలు పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

వైసీపీ హయాంలో శ్మశానవాటికల నిర్వహణ గాడి తప్పిందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. బుధవారం స్థానిక హిందూశ్మశాన వాటికను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ పరిస్థితులనుచూసి సమస్యలను అడిగితెలుసుకున్నారు. వర్షంవస్తే శ్మశాన వాటికలోకి వర్షపు నీరు చేరడాన్ని ఆయన పరిశీలించారు. వెంటనే ఈ వర్షపు నీటిని లింక్ డ్రైనేజీ ద్వారా కనెక్ట్ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాం లో గుత్తేదారుడుకు ఇచ్చిన బర్నింగ్ మిషన్ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బతికున్న మనుషులకే ఎలాగో విలువ ఇవ్వలేదని, ఇక చనిపోతే కనీసం వారిని పూడ్చేందుకు కూడా సరైన వసతులు లేకుండా చేసిందని విమర్శించారు. త్వరలో ఈ శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్, నాయకులు ఫణికుమార్, పురుషోత్తం గౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటి సనత్, కరెంటు ఆది, కేశగాళ్లశీన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని మోద పంచాయతీ చెర్లోపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం కర్నాటక ప్రాంతం నుండి కోనాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తున్న మారుతి, హనుమంతప్పను హిందూపురం నుండి కర్నాటక వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. అనంతరం కారు ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మారుతి, హనుమంతప్పను 108సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హనుమంతప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు.

అవయవ దానం

ప్రజాశక్తి-పెనుకొండ

బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందిన వ్యక్తికి చెందిన అవయవాలు దానం చేయడంతో మరో నలుగురి ప్రాణాలు కాపాడినట్లు అయింది. పట్టణంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన మంజునాథ్(42) వారం క్రితం బెంగళూరు బాప్టిస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల అంగీకారం తో మంజునాథ్ అవయవాలను దానం చేశారు. తను మరణించి మరో నలుగురికి పునర్జన్మ ఇచ్చారని పలువురు కొనియాడారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్న మంజునాథ్ మృతి విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా మహబూబ్ వలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా సూపరింటెండెంట్ మహబూబ్ వలి బుధవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పని చేస్తున్న సిద్ధారెడ్డి ఈవో ఆర్డీగా విధులకు హాజరయ్యారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ, హౌసింగ్‌పై సమీక్ష

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

కదిరి రూరల్ మండలంలో ఉపాధి హామీ, హౌసింగ్ శాఖ పనితీరుపై ఎంపిడిఒ అంజినప్ప అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు కలిగి 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు ఉపాధి హామి పథకం క్రింద ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ మేరకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇక గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై నిలిచిపోయిన గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించాల్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సత్యసాయిజిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక ఈనెల 27న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ ఇన్‌ఛార్జి జింకా ఉదయ్ కిరణ్ తెలిపారు. 16 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాలబాలికలు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 9440041552 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రహదారి పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల కేంద్రంలోని బీసీ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి ఆక్రమణకు గురైనందున వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఆదేశించడంతో ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి సురేందర్ రెడ్డి రహదారిని బుధవారం పరిశీలించారు గతంలో ఈ రహదారి 33 అడుగులు వెడల్పు ఉండేదని ఇప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకోవడంతో రహదారి చిన్నదయిందని అన్నారు. వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. డ్రయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డు మీదనే ప్రవహిస్తోందని దీంతో అపరిశుభ్రత నెలకొందని చెప్పారు. ఈ ఆక్రమణలను తొలగించి డ్రయినేజీని ఏర్పాటు చేస్తామని కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లను నివారిస్తే మించి దిగుబడి

ప్రజాశక్తి-హిందూపురం

పంటను పరిశీలిస్తున్న ఎఒ, తదితరులు

హిందూపురం రూరల్ మండలం మణుగూరు రైతు సేవ కేంద్ర పరిధిలో సరస్వతమ్మ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను మండలవ్యవసాయ శాఖ అధికారి సురేంద్ర నాయక్ బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు బాగా ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల 20 నుంచి 30శాతం దిగుబడి తగ్గుతుందన్నారు. కత్తెర పురుగు నివారణ కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు లేక కోరాజిన్ 60 గ్రాములు నీటిలో కలిపి ఒక ఎకరానికి మొక్క సుడులలో పడేవిధంగా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది కృష్ణ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

భూ వివాద కేసులో లాయర్ రామస్వామి నాయుడుపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ ఎన్ విష్ణు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యులతో సామరస్యంగా చర్చలు జరిపి హామీ ఇవ్వడంతో లాయర్లు సమ్మె విరమింప చేశారని అన్నారు. ఈ కేసును జిల్లా ఎస్పీ వి రత్న ప్రత్యేకంగా తీసుకొని ఈ కేసు పై ప్రత్యేక విచారణ చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో బుధవారం కదిరికి వెళ్లి రిలే దీక్షలో చేస్తున్న లాయర్లు, బాధితుడు లాయర్ రామస్వామి నాయుడుతో సామరస్యంగా చర్చలు జరిపామని ఎఎస్పీ చెప్పారు. చట్టపరంగా తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో లాయర్లు ఈ సమ్మెను విరమింప చేసినట్లు అదనపు ఎస్పీ విష్ణు తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి- మడకశిర

రాష్ట్రస్థాయి వ్యాస మహర్షి అవార్డు గ్రహీత బుల్లసముద్రం ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్‌ను యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సంస్కృతి, విలువలకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు కె. విశ్వనాథ్ వ్యాస మహర్షి అవార్డును అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, నాయకులు కదిరన్న, శివప్రసాద్, కిషోర్, కరియణ్ణ, సూర్య ప్రకాష్, మహంతేష్, నరసింహమూర్తి, నరసింహులు, రామాంజనేయులు రవీందర్ రెడ్డి, వెంకటేష్ ప్రసాద్, గంగప్ప, సత్యలక్ష్మి, స్వర్ణలత, శోభారాణి, మోహన్ బాబు, దొరబాబు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం